క్లుప్తంగా

దాచేపల్లి ఎస్‌ఐ పాపారావు బాధ్యతల స్వీకరణ



దాచేపల్లి: దాచేపల్లి ఎస్‌ఐగా జి.పాపారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంటెలిజెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. సీఐ వెంకట్రావ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సంధ్యారాణి బదిలీపై మాచర్లకు వెళ్లారు.

డిసెంబర్ 14న పల్నాడు మెగా బైబిల్ క్విజ్

మాచర్ల: స్థానిక నెహ్రూనగర్‌లోని సమర్పణ ప్రార్థన మందిరం ఆవరణలో బైబిల్ క్విజ్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ బ్రహ్మానాయుడు, శంకర్, ప్రసాద్ సోమవారం తెలిపారు. యువతలో ఆధ్యాత్మిక భావాలు పెంచేందుకు క్రైస్తవ విశ్వాసులలో బైబిల్ పరిజ్ఞానం వెలికి తీసేందుకు డిసెంబరు 14న క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ. 5 వేలు ఉంటాయని పేర్కొన్నారు. నాలుగు నుంచి 10వ స్థానంలో నిలిచినవారికి రూ.వెయ్యి ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 6362218163, 9866372314 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. పోటీలకు కన్వీనర్లుగా శంకర్, వెంకయ్య, ప్రసాద్, మోహన్ బాబు వ్యవహరించనున్నట్లు తెలిపారు.

3 నుంచి వాసవీ ఉత్సవాలు



మాచర్ల: ఈనెల 3 నుంచి 12 వరకు పాత మాచర్లలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు భవన శ్రీవెంకటేశ్వర్లు, కార్యవర్గం సోమవారం తెలిపింది. ఈసందర్భంగా ముందుగా అమ్మవారి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన వివరాలు, నవరాత్రుల సందర్భంగా వివిధ అవతారాల్లో దర్శనమిచ్చే వివరాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రెంటచింతల: కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్-14, అండర్-17 నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలలో స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ పీటర్ పాపయ్య, పీఈటీ సురేష్ సోమవారం తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో సుస్మిత, అఖిల, అండర్-17 బాలికల విభాగంలో డి.జయంతి, హారిక, అండర్ -17 బాలుర విభాగంలో శివ ప్రసాద్, లక్ష్మయ్య నియోజకవర్గ స్థాయి పోటీలలో విశేష ప్రతిభ ప్రదర్శించి జిల్లా జట్లకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులను హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఇద్దరు ఎంపిక



నాదెండ్ల: యడ్లపాడు మండలం లింగారావు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి తొమ్మిదో తరగతి చదువుతున్న వై.నాగవైష్ణవి అండర్ 17 విభాగానికి, మరో విద్యార్థిని బి హంసిక అండర్ 14 విభాగానికి ఎంపికయ్యారు. వీరు అక్టోబర్ 17, 18, 19 తేదీల్లో అండర్ 17 విభాగంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పోటీలు పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరగనున్నాయి. అక్టోబర్ చివరి వారంలో వినుకొండలో జరిగే అండర్ 14 విభాగంలో బి.హంసిక ప్రాతినిధ్యం వహించనుంది. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం రవి,సర్పంచ్ రాజు, పీఎంసీ చైర్మన్ రాముడు, ఉపాధ్యాయులు అభినందించారు. వీరికి శిక్షణనిచ్చిన పీడీ శ్రీనివాసరావును అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

ఆరు అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

- మాచర్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తీర్మానం
- ఒక కాంట్రాక్టర్‌కే మూడు రకాల పనులు!
- చైర్మన్ నరసింహారావు అధ్యక్షతన సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ నరసింహారావు



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘ పరిధిలో సోమవారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆరు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు కౌన్సిలర్లు తీర్మానం చేశారు. కార్యాలయ ప్రాంగణంలోని కౌన్సిల్ హాలులో జరిగిన సమావేశానికి చైర్మన్ పి.నరసింహారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో 'ఇది మంచి ప్రభుత్వం', స్వచ్ఛతా హీ సేవ, స్వర్ణాంధ్ర-2047 గురించి వివరించేందుకు సచివాలయ, ఆయా శాఖల అధికారులకు అవగాహన కల్పించేందుకు సెప్టెంబరు 26న ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రూ.99,500 ఖర్చు అయిందని, ఈ ఖర్చును మున్సిపాలిటీ భరిస్తున్నట్లు అధికారులు వివరించారు. నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టర్ జల్లెల ఏడుకొండలుకు ఈ పనిని అప్పగిస్తూ చైర్మన్ అనుమతి మంజూరు చేశారు.

ఒకే కాంట్రాక్టర్‌కు నామినేషన్ పనులు!

పలు కాలనీల్లో మంచినీటి బోర్లు, నీటి సరఫరాకు సంబంధించిన పనులకు, ట్రాక్టర్లతో నీటి సరఫరా చేసేందుకు కాంట్రాక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.47.77 లక్షలతో డ్రెయినేజీల్లో పూడికలు, పట్టణానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులను నామినేషన్ పద్ధతిపై అప్పగించేందుకు అనుమతి కోసం కౌన్సిల్ ముందు ఉంచారు. ఈ రెండు కూడా జల్లెల ఏడుకొండలుకు ఇవ్వడానికి పెట్టడంపై 29వ వార్డు కౌన్సిలర్ షేక్ సుభాని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక కాంట్రాక్టర్‌కే అన్ని పనులూ నామినేషన్ పద్ధతిపై ఇవ్వకూడదని గతంలో తీర్మానించామని, కానీ ఇప్పుడు మళ్లీ ఒకే కాంట్రాక్టర్‌కు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. దీనికి చైర్మన్ నరసింహారావు స్పందిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆ కాంట్రాక్టర్ ముందుకు వచ్చినందున వారికే ఇచ్చినట్టు వివరించారు.

వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు స్థలం

మాచర్ల పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ వడియరాజు సాధన కమిటీ సభ్యులు మున్సిపల్ సమావేశంలో ఉంచిన అంశానికి కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ మదార్ సాహెబ్, అరుణ, ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ కౌన్సిర్లు తప్ప, మిగిలిన వారు గైర్హాజరయ్యారు. క్వారం సరిపోవడంతో సమావేశం జరిగింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి.నాగేశ్వరరావు, డీఈ నాగభూషణం, ఏఈ ఆదిత్య, ఆర్‌ఐ వెంగయ్య, మెప్మా ప్రాజెక్టు అధికారి సుబ్బారావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ



చైర్‌పర్సన్ సుబ్బమ్మకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

దాచేపల్లి: నగర పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ చెప్పారు. స్థానిక లైబ్రరీ సెంటర్‌లోని సచివాలయంలో చైర్‌పర్సన్ సుబ్బమ్మ అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. నగర పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పలువురు కార్మికులను తొలగించటంపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కి వినతిపత్రం అందజేశారు. రాజకీయ కుట్ర కోణంలో పారిశుద్ధ్య కార్మికులను అన్యాయంగా తొలగించారని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఇతర పార్టీల ముద్ర వేసి కార్మికులను తొలగించటం మంచి పద్ధతి కాదని కౌన్సిల్ సభ్యులు అన్నారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు చేసిన సిఫారసులు అమలు కావటం లేదని 14వ వార్డు కౌన్సిలర్లు షేక్ షరీఫ్ నేలపై కుర్చొని నిరసన తెలిపారు. కౌన్సిలర్ల మనోభావాలు దెబ్బతినకుండా వార్డులో ప్రతిపాదించిన పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పలు సమస్యలపై కౌన్సిల్‌లో చర్చించారు. ప్రభుత్వ నిధులతో పాటుగా నగర పంచాయతీ నిధులతో ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, కౌన్సిలర్లు వార్డుల్లోని సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని చైర్‌పర్సన్ సుబ్బమ్మ కోరారు. అన్ని వార్డుల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, నగర పంచాయతీ అభివృద్ధిలో కౌన్సిల్ సభ్యులు భాగస్వాములు కావాలని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎంవీ. అప్పారావు, వైస్‌చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, నాగుబండి గురువులు, శ్రీరాం పోలు, మందపాటి సౌజన్య, ఈదా శశిదేవి, వేల్పుల అంజమ్మ, గుంజా వెంటకప్పయ్య, నాగరాజు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత నాడు-నేడు పనులు పూర్తిచేయాలి

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: నాడు-నేడు రెండో విడత నిధులు మంజూరై ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు చెప్పారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొని వచ్చారని, వాటన్నిటిని వెంటనే ఏర్పాటు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వంలో గడప గడపకు కార్యక్రమం ద్వారా గుర్తించిన పనులను వెంటనే పూర్తి చేయాలని, అందుకు అవసరమైన నిధులు మంజూరై ఉన్నాయని మున్సిపల్ చైర్మన్ తెలిపారు.

పలు అంశాలు లేవనెత్తిన కౌన్సిలర్లు

కౌన్సిల్ సమావేశంలో 8వ వార్డు కౌన్సిలర్ గుర్రం అప్పిరెడ్డి మాట్లాడుతూ.. 8వ వార్డులో సుగాలి తండాలో మూడు కల్వర్టులు ఏర్పాటు చేయాలని, అలాగే మున్సిపల్ పరిధిలో ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన పబ్లిసిటీ హోర్డింగ్ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారని తెలపాలని సభాముఖంగా ప్రశ్నించారు.

- 9వ వార్డు కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. వాయిపుత్ర మెడికల్ షాపు నుంచి గంగమ్మ తల్లి సెంటర్ వరకు చిన్నపాటి వర్షం కురిసినా పెద్ద చెరువులా మారుతోందని, తక్షణమే ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయాలన్నారు. పట్టణంలో కోతులు, కుక్కల బెడద బాగా ఎక్కువై కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. గణపతి కాంప్లెక్స్ వెనుక వైపు ఉన్న అపార్టుమెంట్‌కు డ్రెయినేజీ లేకపోవటంతో సీజనల్ వ్యాధులు ప్రబలిన సమయంలో ప్రజలంతా రోగాల బారిన పడుతున్నారని, ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. హైస్కూల్ పక్క వీధిలో నాలుగు రోడ్ల కూడలిలో పెద్ద కుంట ఏర్పడిందని, దానిని వెంటనే పూడ్చాలని, లేని పక్షంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. 9వ వార్డులో మూడు కల్వర్టులను ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తీసుకొని వచ్చారు.
- 2వ వార్డు కౌన్సిలర్ కొక్కెర శ్రీను మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని చెప్పినప్పటికీ ఇప్పటికీ ఏర్పాటు చేయలేదని సభ దృష్టికి తీసుకొని వచ్చారు. కౌన్సిలర్ కొత్త సౌజన్య మాట్లాడుతూ తన వార్డులో పాడైపోయిన కుళాయిలను బాగు చేయాలని సభ దృష్టికి తీసుకొవచ్చారు. యల్లారావు బజారులో వాటర్ ట్యాప్‌లు పని చేయటం లేదని, శానిటేషన్ పనులు అన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని సభ దృష్టికి తీసుకొని వచ్చారు. ఇందుకు గాను మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ మాట్లాడుతూ కౌన్సిలర్ దృష్టికి వచ్చిన పనులను పరిష్కరిస్తామని తెలిపారు. శానిటేషన్ పనులలో కొంత మంది సిబ్బంది సెలవులో ఉన్నారని, వారందరినీ పిలిపించి సమీక్ష నిర్వహించి పట్టణంలో శానిటేషన్ చేపట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. పలువురు కౌన్సిలర్లు వారి వార్డులోని సమస్యలను సభ దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే జూలకంటి పర్యటన

కారెంపూడి: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం కారెంపూడి మండలంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ముందుగా మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కారెంపూడిలోని బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరగనున్న జిల్లా స్థాయి ఖోఖో పోటీలను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రారంభించనున్నారు. అక్కడే వాసవి క్లబ్ నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



పిడుగురాళ్ల: పట్టణంలోని మాంటిస్సోరీ పాఠశాలలో ఎల్‌వీ ప్రసాద్ నేత్రశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరానికి బీజేపీ నాయకులు కేతనబోయిన హనుమంతరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీ, శస్త్రచికిత్సలు నిర్వహించారు. శస్త్రచికిత్స, కళ్లజోళ్ల పంపిణీకి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని వారు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వైద్యులు మల్లేష్, వైద్య సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల, గరికపాటి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవం



పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సోమవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సదర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో రుక్సానా బేగం మాట్లాడుతూ పోషకాహారాన్ని ప్రతి ఇంటికీ చేరవేయాలని, తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారం గురించి బాధ్యతగా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తెలపాలని సూచించారు. అనంతరం తల్లులకు, బాలింతలకు చీరలు, పాలు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు పాండురంగ శ్రీను, జనసేన అధ్యక్షులు కామిశెట్టి రమేష్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు అమీర్‌అలీ, పట్టణ ఉపాధ్యక్షులు షేక్ సేదా పాల్గొన్నారు.

చందోలు నాగవాణికి డాక్టరేట్ ప్రదానం

వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన అబ్దుల్ కలాం థెరిస్సా సేవా సొసైటీ వ్యవస్థాపకురాలు చందోలు నాగవాణికి వైద్య, విద్య, సామాజిక సేవా రంగాల్లో చేసిన సేవలకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు. విజయవాడలో జరిగిన పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ ఆధ్వర్యంలో 129వ గుర్రం జాషువా జయంతి వేడుకల్లో చందోలు నాగవాణి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. వృత్తిరీత్యా ప్రభుత్వ నర్స్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని కొనియాడారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మాచర్ల: పట్టణంలోని కృష్ణ వేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, డైరెక్టర్లు శ్రీధర్‌గుప్తా, డాక్టర్ సదాశివరాజ్‌లు సోమవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించి, వారికి జ్ఞాపికలు అందజేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు షేక్ అబ్దుల్ హాఫీజ్, పి.శివనాగఅంజి, కె.గౌతమ్, ఎ.దీక్షిత్‌రెడ్డి, శ్రీలక్ష్మి విద్యార్థులు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈసందర్భంగా పీడీ అంజినాయక్, స్కూల్ ఇన్‌చార్జిలతోపాటుతో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనులు చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పిడుగురాళ్ల పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఈసందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు విజయవాడ వరదల సందర్భంగా పని చేసిన వారికి ఒక నెల జీతం అదనంగా ఇవ్వాలని, దుస్తులతోపాటు కుట్టుకూలి ఇవ్వాలని, చనిపోయిన కార్మికులకు వెంటనే పరిహారం చెల్లించాలని, వారి స్థానంలో ఆ ఇంట్లో వారికే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సబ్బులు, నూనెలు, యూనిఫాం, చెప్పులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు అంగడి శ్రీనివాసరావు, ధీకొండ వెంకటేశ్వర్లు, శాంకోటి, కృష్ణవేణి, చల్లా పద్మా, అనూషా, అని, పరమేశ్వరరావు, గ్లోరీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రమ్య

కారెంపూడి: స్వచ్ఛతా హీ పక్షోత్సవాలలో భాగంగా మండలంలోని క్లాప్ మిత్రాలకు పంచాయతీ కార్మికులు వారి కుటుంబాలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్మికులు వారి కుటుంబ సభ్యులు క్లాప్ మిత్రాలకు పీహెచ్‌సీ డాక్టర్ రమ్య వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్య సమస్యలను గుర్తించి మందులు రాశారు. ఎంపీడీఓ జి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ముందుగా పంచాయతీ కార్మికులు, క్లాప్ మిత్రాలు తగిన రక్షణ చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. తమకు జీతాలిప్పించాలని క్లాప్ మిత్రాలు కోరగా వెంటనే జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

విద్యార్థులకు లా కళాశాల ప్రతినిధులు సూచన



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

చిలకలూరిపేటటౌన్: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని లా కళాశాలకు చెందిన ప్రతినిధులు చెప్పారు. గుంటూరు జాగర్లమూడి చంద్రమౌళి కాలేజ్ ఆఫ్ లా, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చిలకలూరిపేట పట్టణంలోని నిఖిల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. లా కళాశాలకు చెందిన ప్రతినిధులు హాజరై నూతన చట్టాలు, గృహహింస, బాలికలపై జరిగే అత్యాచారాలు, సైబర్ క్రైం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించడం జరిగినది. కార్యక్రమంలో జాగర్లమూడి చంద్రమౌళీ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపల్ చిట్టినేని సుధాకర్ బాబు, ప్రతినిధులు త్రిపురం సురేంద్రప్రసాద్ (నాని), కె పుల్లారావు, సయ్యద్ షక్రియ, రోష్ని, లహరి, గీతిక, లీలాపవన్, రామకృష్ణ, శ్రీకాంత్, దేవకుమార్, హరి, ప్రకాష్, సింధు, విజయ్, నిఖిల డిగ్రీ కళాశాల అధ్యాపకులు టి.శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ ఇన్‌చార్జి బొంతా భగత్‌సింగ్, చిలకలూరిపేట నియోజకవర్గ కార్యదర్శి ఎం నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎం సాయినాయక్, గోపి, సాహిత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎస్టీ గురుకుల విద్యార్థుల ఎంపిక



శిక్షణ ఇచ్చిన పీఈటీ ఫ్రాంక్లిన్‌ను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు అభినందించారు.

కారెంపూడి: స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్ సోమవారం తెలిపారు. అండర్-14 విభాగంలో వి.బీమ్‌తేజానాయక్, అండర్-17 విభాగంలో బి. హనుమానాయక్ ఎంపికయ్యారని, అండర్-17 జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు పాఠశాల విద్యార్థులు ఎం.రాజశేఖర్, ఆర్.అంజినాయక్ ఎంపికయ్యారని తెలిపారు. పోటీలలో ప్రతిభ చూపి జిల్లా రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను వారికి

కందిలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



రెంటచింతల: కంది పంటను సాగుచేసే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి చెప్పారు. సోమవారం మంచికల్లు గ్రామంలో కంది పంట సాగుపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ముందుగా వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలన్నారు. ఎకరాకు ఖరీఫ్‌లో 2 నుంచి 3 కేజీలు, రబీలో 6 నుంచి 8 కేజీల విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. ఎల్‌ఆర్‌జీ-105, 133-33, 38, సి-11, అభయ కంది రకాలు రబీలో అనువైన కంది విత్తనంగా తెలిపారు. ఈ సదస్సులో మాజీ సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి, గ్రామ పెద్దలు యరపతినేని మట్టయ్య, శీలంనేని శివ, రైతులు పాల్గొన్నారు.

ప్రోడక్ట్ డిజైనింగ్, డ్రాఫ్టింగ్‌పై వర్క్‌షాప్



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు వారం రోజులు నిర్వహించనున్న వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అకడమిక్ క్యాలండర్‌లో భాగంగా ప్రోడక్ట్ డిజైనింగ్ అండ్ డ్రాఫ్టింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈ ట్రైనింగ్ కోర్సుకు 64 మంది విద్యార్థులు హాజరయ్యారు. వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వర్క్‌షాప్ దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఐ.ఫణిసుష్మ, కోఆర్డినేటర్ డాక్టర్ డి.సులోచన, స్టూడెంట్ కోఆర్డినేటర్ బాల పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం



మాచర్ల: పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు దశాబ్దాల పాటు ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైర్డ్ అయిన 18 మందిని సోమవారం సత్కరించారు. జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామారావు, ముఖ్య అతిథులుగా ఎంఈఓ ఎ.సురేష్ హాజరై సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు తాము పనిచేసిన కాలంలోని మధురస్మృతులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డెప్యూటీ డీఈఓలు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



విజయపురిసౌత్: వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే తాళ్లపల్లిలో నివాసం ఉంటున్న ఓర్సు శివయ్య(32) స్థానిక పవర్ గ్రిడ్‌లో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం శివయ్య గుండెపోటుతో మృతి చెందినట్లు భార్య గాయత్రి తెలుపగా, శివయ్య తల్లితండ్రులకు ఆయన మృతిపై అనుమానం వచ్చింది. దీంతో వారు విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ షేక్ మహమ్మద్ షఫీ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ షఫీ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.